

మండపేట సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాళ్లరేవు

నేడు మండపేటలో జరగబోయే రా కదలి రా సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండల టిడిపి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం ఖాయమన్నారు. మండలం నుంచి మండపేట వెళ్లడానికి వేలాదిగా జన సమీకరణ చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, తాళ్లరేవు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, దూళిపూడి బాబి, కట్ట త్రిమూర్తులు, మోపూరి వెంకటేశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, నడింపల్లి వినోద్, కంచర్ల లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు పాల్గొన్నారు.

'బెల్ట్'పై కొరవడిన నిఘా..!

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- యథేచ్ఛగా అధిక ధరలతో బాధుడు
- అడపాదడపా దాడులతో మమ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

'మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తాం. మద్యంను పూర్తిగా నిషేధించిన తరువాతే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతా' ఇదీ ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ. అయితే అధికారంలోకి వచ్చి 5 ఏళ్ల ముఖ్యమంత్రి పదవిని ఆయన అనుభవించారు. 5 ఏళ్ల పాలనలో జగన్ సర్కార్ మద్యపాన నిషేధం మాటనే మరిచిపోయింది. మద్యం అమ్మకాలను ప్రభుత్వమే చేపట్టింది. పైగా మరో 25 ఏళ్ల మద్యంపై వచ్చే ఆదాయాన్ని చూపి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసింది. దీనికితోడు విపరీతమైన ధరలను పెంపుదల చేసి మందుబాబుల కుటుంబాలను గుల్ల చేస్తుంది. రకరకాల నాశిరకం బ్రాండ్లను అమ్మకాలు చేస్తూ మద్యంబాబుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతుంది. మద్యం విక్రయాలపై ఆదాయమే పరమావధిగా భావిస్తూ ఎక్కడికక్కడ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తుంది. ఒకప్పుడు బెల్టు దుకాణాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకున్న అధికారులు ఇప్పుడు ఊరు వాడ అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఏమైనా ఫిర్యాదులు వస్తే అడపాదడపా దాడులు చేసి మమా అన్పించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలో 382 మద్యం షాపులు, 43 బార్లు, వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లు ఉండగా సాధారణ రోజుల్లో దాదాపు రూ.6 కోట్లు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక సందర్భాలు, పండుగల రోజుల్లో రోజూవారీ అమ్మకాలు రూ.8 నుంచి 16 కోట్ల దాటుతోంది. అయితే ప్రతి సంవత్సరం 20 శాతం చొప్పున ఐదేళ్లలో మద్యపాన నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినా క్షేత్రస్థాయిలో మద్యం అమ్మకాలు మరింత పెరిగాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ప్రతీ 10 బడ్డీ దుకాణాల్లో 8 షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. క్వార్టర్ బాటిల్ పై రూ.10 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు అనధికారికంగా బెల్టు షాపుల ద్వారా గత ఏడాది డిసెంబర్ 31 రోజున రూ.7.50 కోట్లు మద్యం అమ్మకాలు జరగగా ఈనెలలో సంక్రాంతి మూడు రోజులపాటు రూ.23 కోట్లు పైనే మద్యం వ్యాపారం జరిగింది. మొత్తంగా నెల రోజుల వ్యవధిలో రూ.100 కోట్లుపైనే మద్యం అమ్మకాలు జరిగాయి. గతంలో బెల్ట్ షాపులు లేని సమయంలో ఈ వ్యాపారం సుమారు రూ.70 కోట్లు మాత్రమే ఉండగా ఈ సారి భారీగా బెల్ట్ షాపులు పెరగడంతో సుమారు రూ. 30 కోట్లు అదనంగా వ్యాపారం జరిగినట్లు అంచనా. ప్రభుత్వ దుకాణాల్లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు జరుగుతుండగా బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బ్రాండ్లే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన కొన్ని బ్రాండ్లు సైతం ఇక్కడ విక్రయిస్తున్నారు. మంచినీళ్లు దొరకని ప్రాంతాల్లో సైతం మద్యం ఏరులై పారుతుంది. గుడి, బడి అనే తేడా లేకుండా మద్యం బాటిళ్లు విక్రయాలు జరుగుతున్నాయి. ఇళ్ల మధ్యే బహిరంగంగానే పగలు, రాత్రి అనే తేడా లేకుండా అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసంగా అటువైపు చూడకపోవడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. నివాస ప్రాంతాలకు అతి చేరువలో బెల్ట్ షాపుల్లో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తుండగా అటువైపు వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల మందుబాబుల మధ్య వివాదాలు జరుగుతుండగా ఘర్షణ వాతావరణం నెలకొనడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మద్యపానాన్ని నిషేధిస్తామని మాట ఇచ్చిన వైసిపి ప్రభుత్వం ఇప్పుడు మద్యాన్ని ఏరులై పారిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అన్ని ప్రాంతాల్లో బెల్టుషాపులు బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నా సంబంధిత ఎస్ఇబి అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తుండడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్ల మత్తులో జోగుతూ కావాలనే పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.



ఏలేశ్వరం పెద్ద వీధిలో బెల్ట్ షాపు వద్ద మద్యం సేవిస్తున్న మందుబాబులు



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వివిధ నియోజకవర్గాల ఇఆర్‌ఒలతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024, ఓటర్ల తుది జాబితా ప్రచురణ, ఎన్నికల సిబ్బంది డేటా బేస్, ఆర్ఒ, ఎఆర్ఒలకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పన, జాతీయ ఓటర్ల దినోత్సవం (జనవరి 25) తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇఆర్‌ఒలతో మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఎన్నికల సిబ్బందిగా విధుల నిర్వహణకు అవసరమయ్యే ఉద్యోగుల డేటాబేస్ రూపకల్పనను పూర్తిచేయడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఆర్ఒ, ఎఆర్ఒల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో జిల్లాలో బూత్ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ, డిఆర్‌డిఎ పిడి కె శ్రీరమణి, పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, కాకినాడ అర్బన్, పిఠాపురం తహశీల్దార్లు పివి.సీతాపతిరావు, పి.శ్రీనాథ్‌రావు, ఎన్నికల డిటి ఎం.జగన్నాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,315 టన్నుల యూరియా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ జిల్లా పరిధిలో వివిధ మండలాలకు 1315 టన్నుల యూరియా ప్రత్యేక గూడ్స్ రైల్లో ఎన్ఎఫ్ఎల్ నుంచి 21 వేగన్లతో సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డ్‌కు శుక్రవారం చేరుకుంది. 29,204 బస్తాలను 50 శాతం ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక సొసైటీలకు, 50 శాతం ప్రయివేట్ డీలర్లకు సామర్ల కోట నుంచి లారీల ద్వారా పంపిణీ చేపట్టారు. ఎగుమతి, దిగుమతి ప్రక్రియను సామర్లకోట రైల్వే స్టేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ పర్య వేక్షించారు.



గూడ్స్ రైలు నుంచి లారీల్లోకి దిగుమతి చేస్తున్న కార్మికులు

న్యాయం చేయాలంటూ టిడిపి ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కోడి కత్తి కేసులో చేయని నేరానికి జైల్లో శిక్ష అనుభవిస్తున్న శ్రీనుకు న్యాయం చేయాలంటూ టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక మరం సెంటర్లో ఎన్‌టిఆర్, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద టిడిపి పట్టణ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ దళితులపై దాడులు చేస్తున్నారు. ఇప్పటికైనా కోడి కత్తి డ్రామాకు తెరదించాలని, అన్యాయంగా జైలు జీవితం గడుపుతున్న శ్రీనుకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జైలులో ఉన్న శ్రీనుకు న్యాయం చేయాలంటూ టిడిపి ధర్నా

కెవిపిఎస్ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) కాకినాడ జిల్లా 2024 క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్ వద్ద సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, కెవిపిఎస్ సీనియర్ నాయకులు మోర్త రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, దళిత సత్తా నాయకులు బచ్చలి కామేశ్వరరావులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుడితి సురేష్ కుమార్, కూరాకుల సింహాచలం, నాయకులు నేరెడుమిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



మద్యాన్ని వీడిన కార్మికులను సత్కరిస్తున్న కమిషనర్

మద్యాన్ని నిషేధించండి

ప్రజాశక్తి - కోటనందూరు

మద్యపాన నిషేధం అమలు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని జిల్లా మద్యపాన వ్యతిరేక కమిటీ డిమాండ్ చేసింది. తుని మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ వర్కర్లలో మద్యపాన వ్యతిరేక స్ఫూర్తి కలిగించడం కోసం సమావేశాన్ని నిర్వహించారు. మద్యపాన వ్యతిరేక మహిళా ఉద్యమాన్ని నిర్వహించిన దూబగుంట రోశమ్మ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మద్యపాన నిషేధ చట్టాన్ని అమలుపరిచిన మాజీ సిఎం ఎన్‌టిఆర్‌లను గుర్తు చేసుకుంటూ, కమిటీ కన్వీనర్ సూర్య నారాయణ కమిటీ సభ్యుడు నాగభూషణ రావు తెలిపారు. ఈ సందర్భంగా నాగ భూషణరావు మాట్లాడుతూ మద్యపానం చేయడం వల్ల ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగాను నష్టపోతున్నారని అన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల వల్ల అనేక మంది మద్యంను తాగడం మానేశారని తెలిపారు. తుని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు మాట్లాడుతూ కార్మికులు మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. మద్యానికి దూరంగా ఉండే కుటుంబాల జీవనం బాగుంటుందని అన్నారు. మద్యాన్ని మానేసిన కార్మికులను గుర్తించి కమిషనర్ చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, కొడుకుల సుబ్బారావు, కె.సింహాచలం, ఆదిత్య కాలేజ్ బిఎస్‌సి విద్యార్థి కందాళ తేజ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచకుండా సమ్మె విరమించం

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 39వ రోజుకు చేరింది. జిల్లావ్యాప్తంగా మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో జరుగుతున్న శిబిరాల్లో వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించేందుకు ఆయా సంఘాలు పిలుపునిచ్చాయి. **కాకినాడ** స్థానిక ధర్నా చౌక్ వద్ద 24 గంటల రిలే నిరహార దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు న్యాయమైన డిమాండ్లపై సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం కుట్రలు సాగిస్తున్నారని అన్నారు. శుక్రవారం విధులకు జాయిన్ కాకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఐసిడిఎస్ అధికారులు నుంచి మెసేజ్‌లు, ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని, ఈ బెదిరింపులకు అంగన్‌వాడీలు బెదిరిపోరని గుర్తుంచుకోవాలని అన్నారు. అంగన్‌వాడీలకు ఈనెల 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు, సిఐటియు అనుబంధ సంఘాలు సంయుక్తంగా రాస్తారోకో నిర్వహించడం జరుగుతుందని, ఈ ఆందోళన రాష్ట్రమంతా జరుగుతాయని వారు తెలిపారు. దీక్షా శిబిరంలో సిఐటియు కాకినాడ నగర అధ్యక్షులు పలివెల వీరబాబు స్వతంత్ర పోరాట చరిత్రను కార్మికులకు వివరించి అంగన్‌వాడీల్లో చైతన్యాన్ని నింపారు. దీక్ష శిబిరానికి మద్దతుగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమల్ల పద్మ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు దడాల పద్మ మాట్లాడారు. అంగన్‌వాడీలు దుర్గా వసంతకుమారి, కె.రత్నకుమారి, ఎన్. అనంతలక్ష్మి, పి.నిర్మల, ఆర్‌టి. ఉష లక్ష్మి, కె.కమలాదేవి, పి.లక్ష్మి, దీక్ష చేపట్టారు. **తాళ్లరేవు** స్థానికంగా జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. వీరి దీక్షకు సిపిఎం, టిడిపి, జనసేన పార్టీ నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, ఉంగరాల బూరిబాబు, అత్తిలి బాబురావు, సుందరపల్లి సత్యనారాయణ, దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకురాజు మద్దతుగా మాట్లాడారు. **కరప** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరం నుంచి పిహెచ్‌సి ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకూ అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, కల్పలత, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదురుగా అంగన్‌వాడీలు సత్యాగ్రహం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి దాడి.బేబీ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహిళల కోసం, మహిళల సమానత్వం కోసం రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించారన్నారు. అటువంటి మహానుభావుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న మహిళలకు న్యాయం చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, టి.నాగమణి, అమలావతి, టిఎల్.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానికంగా జరుగుతున్న నిరసన శిబిరంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత, ఎన్ అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూకరత్నం, ఆర్.రత్నకుమారి, పి.దుర్గాసూర్యకుమారి, కె.రమ్య, పి గంగాభవాని, కె.బంగారు పాప, బి.కృపావతి పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు తులసి మాట్లాడుతూ 37 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయశాంత, వి.వెంకటలక్ష్మి, నళిని, ప్రజావాణి, బి వెంకటలక్ష్మి, రామలక్ష్మి, అమల, రాఘవమ్మ, సత్యవతి ప్రభ, రామ తులసి పాల్గొన్నారు.



పెద్దాపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేస్తున్న అంగన్‌వాడీలు



ఏలేశ్వరంలో పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



పార్టీలో చేరుతున్న వారికి టిడిపి కండువాలను వేస్తున్న యనమల దివ్య, కృష్ణుడు,

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - కోటనందూరు

చంద్రబాబు నాయుడు పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తుని నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ యనమల దివ్య, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి యనమల కృష్ణుడు అన్నారు. లక్ష్మీదేవిపేట గ్రామంలో మాజీ సర్పంచ్ పెనుముచ్చ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల టిడిపి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ పరిపాలనలో సామాన్యుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని అన్నారు. నిత్యవసర వస్తువులు ధరలో పెరిగిపోవడంతో సామాన్యుల జీవితాలు మరింత దిగజారి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడి రాజబాబు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యనమల దివ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబును సిఎంను చేసే బాధ్యతను తీసుకోవాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 50 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మోతూ్కరు వెంకటేష్, అంకమ్మరెడ్డి బుల్లిబాబు, ఏలేటి శంకర్, అంకమ్మరెడ్డి రమేష్, దంతులూరి చిరంజీవి రాజు, నెమ్మది సత్తిబాబు, లగుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

యువత రాజకీయాల్లోకి రావడం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని తూర్పు లక్ష్మీపురం సర్పంచ్ వీరంరెడ్డి నాగ భార్గవి డాక్టర్ పట్టాను అందుకున్న సందర్భంగా శుక్రవారం అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యప్రభ పాల్గొని చిన్న వయసులోనే సర్పంచ్ పదవిని అందుకున్న నాగ భార్గవి ప్రజా సేవ చేస్తూనే మరోపక్క చదువును కొనసాగించి డాక్టర్ పట్టాను అందుకోవడం అభినందనీయమని అన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చిన నాడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సర్పంచ్ డాక్టర్ నాగభార్గవి మాట్లాడుతూ తనకు చిన్నతనం నుంచి విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలపై మక్కువ ఉండేదన్నారు. తల్లితండ్రులు, గ్రామస్తులు సహకారంతో సర్పంచ్‌గా గెలుపొందానని, రాజకీయాలకు విద్య అడ్డంకి కాబోతున్నారు. వైద్యురాలిగా సేవలందిస్తూ రాజకీయాల్లో కొనసాగుతానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యమంలో మండల టిడిపి అధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపిటిసి సభ్యులు కొప్పుల బాబ్జి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, పెంద్ర శ్రీను, బస ప్రసాద్, రుచి రమేష్, పలివెల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సర్పంచ్‌ని అభినందిస్తున్న వరుపుల సత్యప్రభ

కార్టూ'నిజం'



రోడ్డుపై మత్స్యకారుల వంటా వార్పు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఎన్ఇజెడ్‌లోని లైపిజ్ కంపెనీ నిర్మాణంలో భాగంగా సముద్రంలోకి వేసిన పైపులైన్లు తొలగించాలని మత్స్యకారులు చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం కోనపాపపేటలో మత్స్యకారులు రోడ్డుపైనే వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ కాకినాడ జిల్లా తొండంగి మండలంలో లై పిజ్ కంపెనీ నిర్మాణంలో భాగంగా సుమారు 7 కోట్ల లీటర్ల వ్యర్థాలను సముద్రంలోకి వదిలేందుకు సుమారు 5 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ వేశారని,దీనివల్ల తీరం వెంబడి సుమారు ఏడు గ్రామాల మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. సంవత్సర కాలంగా ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా.. సమస్య పరిష్కారం కాకపోవడంతో ధర్నాకు దిగినట్టు తెలిపారు. ఆందోళనకారులతో కాకినాడ నుంచి వచ్చిన అధికారులు చర్చలు సాగించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి, ట్రైనీ ఎస్‌పిలు స్థానిక పెద్దలలో కలసి చర్చలు జరిపారు. స్థానికుల్లో కొందరు ఒక కమిటీ వేసుకోవాలని, ఆ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌తో చర్చలు నిర్వహించాలని, అప్పటి వరకూ ఆందోళనను విరమించాలని సూచించారు. దీంతో పోలీసు అధికారుల సూచన మేరకు ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు మత్స్యకారులు తెలిపారు.



మత్స్యకారులతో చర్చిస్తున్న డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి

సాల్ట్ భూములు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగి పంచాయతీలోని సర్వే నెంబర్ 47/3లోని 4 ఎకరాల 24 సెంట్ల భూమి తమకే కేటాయించాలంటూ స్థానికులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కట్టా త్రిమూర్తులు, వారా సూర్య కుమారి మాట్లాడుతూ చొల్లంగి గ్రామంలోని ఈ సాల్ట్ భూముల్లో గతంలో ఒక్కొక్కరికి 1.50 సెంట్లు చొప్పున 2000 ప్రాంతం లో 32 మందికి ఉప్పుమల్లు లో పనిచేసే కార్మికులకు పట్టాలు ఇచ్చారన్నారు. మిగిలిన నాలుగు ఎకరాల 24 సెంట్లు భూమి స్థానికులకు ఇవ్వాలని అనేకమార్లు విన్నపాలు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం ఈ భూమిని కాకినాడ రూరల్‌కు చెందిన ఉప్పలంక గ్రామస్తులకు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది తగదని అన్నారు. స్థానికులకు ఇవ్వకుండా స్థానికేతరులకు ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. సంఘటనా స్థలానికి తాళ్లరేవు, కరప తహశీల్దార్లు ఎస్.పోతురాజు, శ్రీనివాస్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన సాల్ట్ కమిషన్ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడానికి 2019లో ప్రతిపాదనలు పంపించారని, 2022 డిసెంబర్ 3 నాటికి ఈ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ఆ భూమిని ప్రభుత్వ నిధులతో గురువారం స్థలాన్ని బాగు చేసినట్లు తెలిపారు.



స్థానికులకే భూమిని కేటాయించాలంటూ ధర్నా చేస్తున్న గ్రామస్తులు

నేటి నుంచి లాన్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కాకినాడ


ఈ నెల 20 నుంచి 24 వరకూ 67వ పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలురు జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు డిఇఒ జి.నాగమణి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తి తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. 24 రాష్ట్రాల నుంచి 115 మంది క్రీడాకారులు, 46 మంది కోచ్‌లు, 100 మంది స్థానిక అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బివివిఎస్‌వి.ప్రసాద్, ఉపవిద్యాశాఖాధికారులు ఆర్.డేనియల్ రాజు, డి.సుభద్ర, 24 రాష్ట్రాల కోచ్ మేనేజర్లు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ నాగమణి

నేరాలు ఘోరాలు

సిసి కెమేరాల స్తంభాన్ని ఢీకొట్టిన ట్రైలర్ వాహనం



నేలకొరిగిన సిసి కెమేరాల స్తంభం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట - కాకినాడ రోడ్డులోని అచ్చంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో సిసి కెమేరాల స్తంభాన్ని ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రైలర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ స్తంభానికి ఉన్న సిసి కెమెరాలు ధ్వంసమయ్యాయి. శుక్రవారం తెల్లవారు జామున పెద్దాపురం వైపు నుంచి కాకినాడ వైపు వెళ తున్న లారీ ట్రెలర్ వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో సిసి కెమెరాల యూనిట్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కేబిన్ నుంచి కింద పడిపోగా అతని చేతికి గాయమైంది. అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు విక్రయించే రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామనిరీజనల్ విజిలెన్స్ ఇన్‌ఛార్జి ఎస్‌పి ఎ.సురేష్ బాబు హెచ్చరించారు. గురువారం రాజానగరం మండలంలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ జగన్నాథపురం గ్రామంలోని ఫుడ్ పిరమిడ్‌ను తనిఖీ చేసి కేసును నమోదు చేశామన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ జరుగుతుందని తెలపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి ముత్యాలు నాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగ వెంకట రాజు, లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, షబ్బీర్, జగన్నాథరెడ్డి, జీవానందం పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎస్ఇబి స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో భాగంగా పెద్దాపురం స్టేషన్ పరిధిలో తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలో ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం ముమ్మిడివరం పోలీసులు తెలిపారు. మండలంలోని అన్నంపల్లి గ్రామానికి చెందిన లంక సాయమ్మ మతి స్థిమితం లేని వృద్ధురాలు గత బుధవారం రాత్రి నుంచి కనిపించక పోవడంతో కుమార్తె అయినవిల్లి దేవి ఫిర్యాదు మేరకు, అలాగే గేదెల్లంక గ్రామానికి చెందిన లొల్ల వీర వెంకట భావన రుషి(34) గురువారం నుంచి కనపడకపోవడంతో తండ్రి కృపావరం ఫిర్యాదు మేరకు స్టేషన్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-ధవళేశ్వరం

గోదావరిలోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడబోయిన మహిళను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కాపాడారు. కడియం మండలానికి చెందిన గోళ్ల ఆది లక్ష్మి కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది బ్యారేజ్ మీద నుంచి దూకి చనిపోదామని ధవళేశ్వరం బ్రిడ్జి వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు 112కు కాల్ చేశారు. ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాలతో ధవళేశ్వరం సిఐ కె.మంగాదేవి వెంటనే స్పందించి పోలీసులు సిబ్బందిని హుటాహుటిన పంపించారు. వారు ఆమెను గుర్తించి ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. బంధువులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

భారత్ జోడో యాత్రకు అనూహ్యస్పందన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కామన

ప్రజాశక్తి - మండపేట

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు అనూహ్యస్పందన లభిస్తోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు అన్నారు. స్థానిక ఏడిద రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే ఎపికి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. బిజెపి, జనసేన, టిడిపి వైసిపిలను ప్రజలు నమ్మేస్థితి లేదని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పాడిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి కొడవళ్ల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

-అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జనవరి 26న నిర్వహించబోయే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పోలీస్ పెరేడ్‌ను సిద్ధం చేయడంతోపాటు పోలీస్ బ్యాండ్, జెండా ఆవిష్కరణ వేదిక, బందోబస్తు, తదితర అంశాలకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా విద్యా శాఖ అధికారి కనీసం ఐదు సాంస్కృతిక కార్యక్రమాలకు తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య, మార్కెటింగ్, డ్వామా, పిఆర్, డిపిఒ, హౌసింగ్, టిడ్కో, కుడా, విద్య, డిఆర్‌డిఎ, మెప్మా, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, హెల్త్ తదితర శాఖలు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు ప్రతిభింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లకు ప్రణాళిక ప్రకారం రూపొందించి సిద్ధం చేయాలన్నారు. పోలీస్ మైదానం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎఆర్ అడిషనల్ ఎస్‌పి బి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ కె.శ్రీరమణి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, పోలీస్, ఎన్‌సిసి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా జెసి ఎస్.నుపూర్ అజయ్

ప్రజాశక్తి-అమలాపురం

వ్యవసాయ, జలవనరులు, డ్రైనేజీ విభాగాలు సమన్వయంతో ప్రస్తుత రబీ సాగుకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత డిసెంబర్ మాసంలో మండలి సభ్యులు తీర్మానించిన అంశాలపై తీసుకొన్న చర్యలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో రైతుల సమస్యల పట్ల ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ సమస్యలపై అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ చర్చించారు. ఆయా సమస్యలు పరిష్కారానికై సంబంధిత అధికా రులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నది ఆమె అధికారులను అడిగి తెలుసుకుని సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు సమస్యలు నివేదించి త్వరగా అనుమతులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఉపాధి అనుసంధానంతో పంట కాలువలో పూడికలుతీతకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు అదేవిధంగా సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేసే విధంగా షట్టర్ గేట్ల లీకేజీలను అరికట్టాలని ఆమె ఆదేశించారు. రబీ సాగుకు నీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా డ్రైనేజీలలో క్రాస్ బండ్లు వేయడం వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతో పాటు ఫిబ్రవరి 5 నుంచి వారాబంధి విధానంలో సాగునీరు విడుదల చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 1, 02,701 విస్తీర్ణంలో రబీ సాగు చేపట్టడం జరిగిందన్నారు. మండలి సభ్యులు రమేష్ పలు రైతాంగ సమస్యలను వివిధ డ్రైనేజీల సమస్యలను అధికారులు దష్టికి తెచ్చారు. రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరు రామారావు మాట్లాడుతూ దాన్యం సేకరణ ప్రక్రియ ను ఖరీఫ్ సీజన్లో జెసి వారి స్వీయ పర్యవేక్షణలో చక్కటి సమన్వ యంతో పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణలో పాల్గొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి పెండింగ్ వేతనాలు జిల్లా పౌరసరఫరాలు జిల్లా సహకార శాఖ సమన్వయంతో చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మోటూరు సాయి, వ్యవసాయ శాఖ అధికారులు కాకి నాగేశ్వరరావు, వెంకట రామారావు,ఎల్ డి ఎం కే శ్యాంబాబు మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఎస్.నుపూర్ అజయ్

యానాం వార్తలు

మాజీ స్పీకర్ కామిశెట్టికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి మాజీ స్పీకర్ కామిశెట్టి పరశు రామ వం ప్రసాదరావు నాయుడు వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిప్మర్ ఆసుపత్రి సమీపంలో ఇందిరా గాంధీ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా ది యానం తెలగా(కాపు) అభ్యుదయ సంఘ సభ్యులు నల్లా వెంకన్న, చెక్కల అరుణ్‌కుమార్, బండాబత్తుల ప్రసాద్, కామిశెట్టి కుటుంబ సభ్యులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రఘునాయిగం, పిడబ్ల్యుడి ఎఇ నాగరాజు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

23న జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పరీక్షాపే చర్చ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో యానంలో 9 నుంచి 12వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఐదుగురికి మించకుండా పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించి పరీక్షలను ఇష్టంగా రాయాలని సంకల్పంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీకి అవసరమైన సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఇందులో 'పరీక్షలను పండగలా జరుపుకుందాం', 'పరీక్షలకు ఆందోళనతో కాదు', 'యోధుల్లా వెళ్దాం', 'టెక్నాలజీతో చదువు మరింత సులభం', 'చంద్రయాన్' అనే నాలుగు అంశాల్లో ఏదైనా ఒక విషయ నేపథ్యంతో విద్యార్థులు సృజనాత్మక చిత్రలేఖన చేయవలసి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9849778512 నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా డివైఇఒ యస్‌వివి.సత్యనారాయణ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కళశాల్లో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ప్రతి తరగతి గదికి వెళ్లి పరిశీలించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారు జయీభవ 50 రోజుల కార్యక్రమాన్నిప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రతి అధ్యాపకుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివించే విధానంలో భాగంగా విద్యార్థులకు సంబంధించి రాబోవు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి అధ్యాపకులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఆలాగే పబ్లిక్ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ప్లాన్ చేసుకొని చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత శాతం సాధించాలని కళాశాలకు మంచి పేరు తేవాలని, హాజరు శాతం, పెంచుకోవాలని, కళాశాలకు రాని విద్యార్థుల తల్లి దండ్రులకు దూరవాణి ద్వారా మాట్లాడి కళాశాలకు విద్యార్థులు వచ్చే విధంగా చేయాలని సుచించారు . కళాశాలలో నాడు - నేడు పనులను కూడా పరిశీలించారు.కళాశాల ప్రిన్సిపల్ పి గోపాలకృష్ణ పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణ పరిశీలిస్తున్న డివైఇఒ

జొన్నాడలో ఘనంగా వేమన జయంతి

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడ గ్రామంలో శుక్రవారం వేమన జయంతి వేడుకలను రెడ్డి సంఘం సభ్యులు నిర్వహించారు. ముందుగా యోగి వేమన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన పద్యం ఒకటైనా రాని తెలుగువారు ఉండరని, తెలుగు జాతి ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచే ఉంటాయన్నారు. వేమన తెలుగు సాహిత్యానికి ఒక కొండగుర్తుగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో వేమన రెడ్డి సంఘం నేతలు తాడి తమ్మిరెడ్డి, మేడపాటి రామారెడ్డి, తాడి శ్రీనివాస్ రెడ్డి, సత్తి శ్రీనివాస్ రెడ్డి, ద్వారంపూడి అప్పారెడ్డి, ద్వారంపూడి దొరబాబు, సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

విజయవాడకు తరలిన వైసిపి శ్రేణులు

తాళ్లరేవు : విజయవాడలో డాక్టర్ బిఆర్.అం బేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి ఎంపిపి రాయుడు సునీత ఆధ్వర్యంలో మండలం నుంచి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



ఆలమూరులో గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. **ఆలమూరు** మండలంలోని మూలస్థానం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 2007-08 టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మిత్రుల్లో ఇన్నేళ్ల తర్వాత కుటుంబ సభ్యులతో వచ్చి ఆ'పాత' మధురాలను పంచుకున్నారు. తమను తాము పరిచయం చేసుకుంటూ తరగతి గదుల్లో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శాలువాలు, పూలదండలు, కానుకులతో తమ గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల కలయిక కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజాహిత కార్యక్రమాలకు ఒకరికొకరు సహకరించుకునే విధంగా చేయూత నివ్వాలని పూర్వ విద్యార్థులు అన్నారు. ఎవ్వరికీ ఎలాంటి అవసరం వచ్చినా అందరం కలిసి భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తోట సతీష్, కంచుమర్తి సురేష్, ముచ్చర్ల రాజు, గుండు బోగుల ప్రసాద్, దేవరపూడి నాగేశ్వరరావు, తోట సత్తిబాబు, పాల్గొన్నారు. **రాజోలు** మండలంలో శివకోటి జడ్‌పిఉన్నత పాఠశాల్లో1982-83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తెలగ కల్యాణమండపంలో నిర్వహించారు. అప్పటి టెన్త్ స్కూల్ టాపర్స్ మేడిచర్ల రామా రావు, మేడిచర్ల సత్యనారాయణలను, అప్పటి బ్యాచ్‌లో మొదటిగా ప్రభుత్వ ఉద్యోగం లో చేరిన బర్రె సత్యనారాయణ మరియు మాథ్స్ టీచర్ చిట్టావర్జుల సుబ్రహ్మణ్యం, సోషల్ టీచర్ అడ బాల జగన్నాథరావు, తెలుగు టీచర్ (అప్పటి రాష్ట్ర బెస్ట్ టీచర్ అవార్డ్ గ్రహీత) స్వర్గీయ కంపెళ్ళ సబ్బాయుడు కుమార్తె కంపెళ్ల బాలా త్రిపుర సుందరి లను సత్కరించారు.కమిటీ సభ్యులు బి.రాచయ్య, బాలాజీ వేమ, కేసరి సత్య, చెల్లబోయిన సూర్య చంద్ర రావు, అనిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు. తమ తోటి పూర్వపు విద్యార్థుల పిల్లలైనా ఆర్థిక కారణాలతో చదివించే స్థాయి లేకపోతే, వారిని దత్తత తీసుకొని చదివించే బాధ్యత తీసుకున్నట్లు కమిటీ నిర్ణయం తీసుకుంది. **మండపేట** స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో 1984-85లో టెన్త్ చదువు కున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కాపు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. వివిధ రంగాలలో వివిధ ప్రాంతాలలో స్థిరపడిన బాల్య మిత్రులందరూ ఉత్సాహంగా గడిపారు. భవిష్యత్తులో ప్రతి సంవత్సరం కలిసి సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడ్రేవు శ్రీనివాస్, యేలేటి వెంకటేశ్వరరావు, కర్రి వెంకటరమణ, దూలం నాగు, మన్యం ప్రసాద్, శెట్టి నాగేశ్వర రావు,విజ్ఞాన్ గణేష్ పాల్గొన్నారు.



రాజోలులో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మండపేటలో పూర్వ విద్యార్థులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ భేటీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్-2024 రూప కల్పనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న వివిధ కార్యకలాపాలు, ఫారం 6, 7, 8 లకు పరిష్కారాలు, ఎన్నికల సంఘం మార్గదర్శ కాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన కనీస సౌకర్యాలైనా విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్ నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇవిఎం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), పెద్దిరెడ్డి రవికిరణ్ (బిజెపి), గదులు సాయి బాబా(టిడిపి), సబ్బారపు అప్పారావు (బిఎస్‌పి), మోర్త రాజశేఖర్ (సిపిఎం), నరాల శివ (ఆప్,) కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివద్ధి ప్రణా ళికపై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని మండల అభివద్ధి అధికారి ఐదం రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో గ్రామ పంచాయతీలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ తడితర అంశాలపై ప్రణాళికతో పాటు సూచనలు సలహాలు అందిస్తారన్నారు. . ప్రత్యేక శిక్షణ పొందిన గ్రేడ్-1 పంచా యతీ కార్యదర్శులు వివిఆర్‌కె.రాజు, కె.సాయి ప్రసాద్ లు శిక్షణ ఇచ్చారు. కార్య క్రమంలో మండల పరిపాలన అధికారి విఎన్.ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి నేడు ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ ఆర్.కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 37 కేంద్రాల్లో జరిగే ఈ ప్రవేశ పరీక్షకు 8,506 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కాకినాడ జిల్లాలో 15, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 15, తూర్పు గోదావరి జిల్లాలో 7 కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు.